నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | HYDERABAD

బీజేపీ నుంచి 200 మంది బీఆర్ఎస్‌లోకి..

జీడిమెట్ల, ఏప్రిల్ 27: చింతల్ డివిజన్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ సాయి రాంరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

శనివారం రెజిమెంటల్ బజార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

మూసీ గొప్పతనానికి
నడక

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : దక్కన్ హెరిటేజ్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం 'మూసీ రివర్ అండ్ హెరిటేజ్ ఇంటర్ ఫేస్ వాక్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలిస్ట్ డాక్టర్ హైదర్ మాట్లాడుతూ.. మూసీ నదితో హైదరాబాదీలకు ఉన్న గాఢమైన భావోద్వేగ బంధాన్ని వివరిస్తూ.. ' మూసీకి నా హృదయంలో ప్రత్యేక ప్రాముఖ్యత' ఉందన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ వేదకుమార్ మాట్లాడుతూ.. నది గొప్ప చరిత్రపై అందరికీ అవగాహన కల్పించేందుకు మూసీ తీరం వెంట 'నడక' అనే కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు. 1908 నాటి వరదలను ప్రస్తావిస్తూ ఆనాటి బాధితుల ప్రాణాలను కాపాడడంలో చింతచెట్టు ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతి వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని వేదకుమార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఎర్రగడ్డలో ఓ దుకాణదారుడితో కరచాలనం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

మా ఓటు కారు గుర్తుకే
నినదించిన జూబ్లీహిల్స్ ఓటర్లు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి పద్మారావు పాదయాత్రకు జననీరాజనం

ఎర్రగడ్డ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం రాత్రి ఎర్రగడ్డలో పాదయాత్ర చేశారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎర్రగడ్డ, ఓల్డ్ సుల్తాన్‌నగర్, సుల్తాన్‌నగర్ తదితర బస్తీల మీదుగా సాగిన ఈ పాదయాత్రలో స్థానికుల నుంచి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. పలు చోట్ల స్థానికులు భవనాల పైనుంచి పూల వర్షాన్ని కురిపించారు. కేటీఆర్‌తో స్థానికులు సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. దారి పొడవునా ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి చిరు వ్యాపారులకు షేక్ హ్యాండ్ ఇస్తూ.. కేటీఆర్ ముందుకు కదిలారు. ఇంటింటికీ వెళ్లిన ఆయన కారు గుర్తుకు ఓటేసి.. ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని విధాలా ఆదుకున్న కేసీఆర్.. సుపరిపాలన అందించారని.. తమ ఓటు కారు గుర్తుకే అంటూ.. వయో వృద్ధులు, మైనార్టీలు సహా అందరూ ముక్త కంఠంతో నినదించారు. కేటీఆర్ పాదయాత్ర సందర్భంగా ఎర్రగడ్డ పుర వీధులు గులాబీమయంగా మారాయి. పార్టీ జెండాలను చేబూని మహిళలు సహా వందలాది మంది నినాదాలు చేస్తూ కేటీఆర్‌ను అనుసరించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సోహైల్, కార్పొరేటర్లు దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, బోరబండ అధ్యక్షుడు కృష్ణమోహన్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇస్త్రీ షాపు నిర్వాహకుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్..

పాదయాత్రలో సందడి చేస్తున్న కేటీఆర్, పద్మారావు గౌడ్

ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, చిత్రంలో మాగంటి గోపీనాథ్

సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, చిత్రంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కేసీఆర్ అంటేనే నమ్మకం

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 27: కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. నాగారంలో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే మోసమని, ఆ పార్టీ ప్రజలకు నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు. పదేండ్లలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేన్నారు. నమ్మకం అంటే కేసీఆర్ అని, విశ్వాసం అంటే కేటీఆర్ అని, భరోసా అంటేనే బీఆర్ఎస్ అని అన్నారు. రాష్ట్రంలో 10 నుంచి 12 ఎంపీ సీట్లను గెలుస్తామని, నాయకులు బీఆర్ఎస్‌ను వీడినా.. పార్టీకి నష్టం లేదని, కార్యకర్తలు బలంగా ఉన్నారని తెలిపారు. ఈటల బీఆర్ఎస్‌ను మోసం చేసి బీజేపీలో చేరారన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 25 ఏండ్లుగా ప్రజల మధ్య ఉండి సేవ చేస్తున్నానని, అధిక మోజార్టీతో గెలిపించాలని శ్రేణులను కోరారు. నాగారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు చామకూర భద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు రమేశ్‌గౌడ్ ,వెంకటేశ్, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంగూడలో పోస్టుకార్డులతో నిరసన

శామీర్‌పేట, ఏప్రిల్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కరువుకాటకాలకు నెలవని, తెలంగాణలో ఎక్కడ చూసినా కరువు తాండవిస్తున్నదని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తరపున శనివారం ఎన్నికల ప్రచారం చేస్తూ..రైతు సమస్యలపై పోస్టుకార్డుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రూ.15 వేలు ఇస్తామని ఆశచూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటి వరకు సరైన కరెంటు, రైతుబంధు, సాగునీళ్లు ఇవ్వలేకపోయిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, రైతులు దత్తుగౌడ్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని చాకుతో బెదిరించి..
ఆభరణాలు తస్కరణ

కాచిగూడ, ఏప్రిల్ 27: ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న ఎస్సైని గుర్తుతెలియని వ్యక్తులు చాకుతో బెదిరించి బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లను తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానిలయం, ప్రగతినగర్ కాలనీకి చెందిన నారాయణ కుమారుడు డి.ప్రసాద్ (55) డార్జిలింగ్ పట్టణంలో సీఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు. ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్- ఫలక్‌నుమా ఎంఎంటీఎస్ రైలు ఎక్కారు. యాకత్‌పుర స్టేషన్‌లో నలుగురు ఆగంతకులు.. రైలు ఎక్కి ఎస్సై ప్రసాద్‌ను చాకుతో బెదిరించి, దాడి చేసి.. ఆయన వద్ద ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.700 నగదు, 2 సెల్‌ఫోన్లను తీసుకొని ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో దిగి పారిపోయారు. ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్కేపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కేసీఆర్ గుర్తులను చెరపలేరు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, ఏప్రిల్ 27: కేసీఆర్ గుర్తులను ఎవరూ చెరిపి వేయలేరని, తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ అని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ ఆధ్వర్యంలో సురభీ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులకు పరిపాలన చేతగాక నిత్యం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు రంగారెడ్డి జిల్లాపై పూర్తి అవగాహన ఉన్నదని, అలాంటి వ్యక్తిని గెలిపించుకుంటే ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో గళం విపుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర పరిపాలనపై అవగాహన లేదని, ప్రజలకు ఏమి కావాలో తెలియని నాయకుడని చెప్పారు. 70 ఏండ్ల వయస్సులో కేసీఆర్ రాష్ట్రంలో పర్యటిస్తూ.. ఎండిన పంటలను పరిశీలిస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తూ.. సేద తీరుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి, మహిళ అధ్యక్షురాలు లిక్కి ఊర్మిలారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంట జలాశయాల
సందర్శన

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నగర శివారులోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను శనివారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సందర్శించారు. రెండు రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా ప్రక్రియను పరిశీలించారు. ప్రస్తుతం ఉస్మాన్‌సాగర్ జలాశయం నుంచి 20 ఎంజీడీలు, హిమాయత్‌సాగర్ నుంచి 8 ఎంజీడీల నీటిని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నీటిని ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్, గండిపేట కాండూట్‌పై ఉన్న వర్టికల్ నీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసి.. ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ (సాంకేతిక) రవికుమార్, సీజీఎం దశరథ్‌రెడ్డి, సంబంధిత జీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌సీల్లో మూడెంచల భద్రత

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏర్పాటు చేసిన డీఆర్‌సీల్లో మూడెంచల భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీ విద్య, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన యాకత్‌పుర, చార్మినార్, బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ, బండ్లగూడలోని ఆరోరా లీగల్ సైన్సెస్ అకాడమీలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీలను సందర్శించారు. ఏర్పాట్లు, రిజిస్టర్లు, పోలీస్ లాగ్ బుక్‌లను పరిశీలించారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్‌ను అద్భుతంగా నిర్మిస్తాం

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్ నిర్మాణం ఎన్నో సవాళ్లతో కూడుకొని ఉన్నదని, అయినా అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ పరిజ్ఞానంతో వాటిని అధిగమించి అద్భుతమైన రీతిలో నిర్మిస్తామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. శనివారం ప్రతిపాదిత శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్‌లో సుమారు 14 కి.మీ మార్గాన్ని ఇంజినీరింగ్ అధికారులు, కన్సల్టెంట్‌లతో కలిసి కీలకమైన ప్రాంతాలను పరిశీలించారు. మెట్రో అధికారులు డీవీఎస్ రాజు, ఎస్‌కే దాస్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ మోహన్, జీఎం బీ.ఎన్. రాజేశ్వర్, ఎస్.ఈ వై.సాయపరెడ్డి, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సిస్ట్రా ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి కారిడార్‌లో నిర్మించే స్టేషన్ల స్థలాల పరిశీలన, ఫ్లై ఓవర్లు ఉన్న చోట చేయాల్సిన మార్పులపై చర్చించారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా విమానాశ్రయం లోపలి వరకు నిర్మిస్తున్న మార్గంలో ఎక్కడెక్కడ స్టేషన్లు నిర్మించాలి.. మూసీనది, ఎల్బీనగర్ జంక్షన్, బైరామల్‌గూడ-సాగర్ రింగ్ రోడ్డు, చాంద్రాయణగుట్ట ఇంటర్‌చేంజ్ స్టేషన్ నిర్మించే చోట ఎదురవుతున్న సవాళ్లను ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై ఇంజినీరింగ్ అధికారుల బృందంతో చర్చించారు. ఆయా ప్రాంతాల్లో అడ్డంకులుగా ఉన్న ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్, మూసీ నది తీర ప్రాంతాలు, ఇతర భారీ నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించి.. ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. నాగోల్-ఎయిర్‌పోర్టు మార్గంలో కొత్తగా నాగోల్ వద్ద నిర్మించనున్న మెట్రోస్టేషన్.. ప్రస్తుతమున్న నాగోల్ స్టేషన్‌కు దగ్గరలోనే ఎడమ వైపు (ఎల్బీనగర్ వైపు) ఉంటుంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఈ రెండు స్టేషన్లను కాన్‌కోర్ లెవల్‌లో కలుపుతూ.. విశాలమైన స్కైవాక్ నిర్మించాలని ఎండీ ఆదేశించారు. నాగోల్ స్టేషన్ తర్వాత మూసీ నది వంతెనను ఆనుకొని ఉన్న పెద్ద పెద్ద మంచినీటి పైపులు, భూగర్భ హైటెన్షన్ విద్యుత్ కేబుళ్ల దృష్ట్యా, మెట్రో అలైన్‌మెంట్‌ను మరో 10 మీటర్లు ఎడమ వైపునకు జరపాలన్నారు. మూసీ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని, ఆ నదిపై మెట్రో బ్రిడ్జిని పొడవైన స్పాన్‌తో నిర్మించాలన్నారు. ఎల్బీనగర్ జంక్షన్ కుడివైపున ఉండబోయే కొత్త మెట్రో స్టేషన్‌ను ఇప్పటికే ఉన్న కారిడార్-1 (మియాపూర్-ఎల్బీనగర్)లోని ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌కు విశాలమైన స్కై వాక్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు.

ఇంజినీర్లకు సూచనలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి